మాయజాలి మెరిక

గుడిసేవ సుందరరామయ్య

"ఆనంద్ !" గట్టిగా అరవాలను కొన్నారు రావ్ గారు. కాని గొంతు పెగల్లేదు.

మనసులో ఆవేశం, అవమానం ఒక్కుమ్మడిగా కల్గాయి. ఎంతో కాలం నుంచి కాపాడుకు వస్తున్న ఆత్మాభిమానం దెబ్బతిన్న పులిలా విజృంభించింది.

వయసు తెచ్చిన పెద్దరికం సింహంలా గర్జించింది.

డబ్బు తెచ్చిన దర్పం పాములా బుసకొట్టింది.

కళ్ళు అగ్నిగోళాలయ్యాయి.

ముక్కుపుటాలు రోషంతో ఎగిరెగిరి పడ్డాయి.

ఉద్రేకం, ఉద్వేగం రావ్‌గారి శరీరంలో అణువణువునా వ్యాపించాయి.

కోపంతో పిడికిళ్ళు బిగించి అటు ఇటు పచార్లు చేయసాగారు.

చేతిలోని ఉత్తరం నలిగిపోతూంది !

ఆయన మనసులో అంతులేని సంఘర్షణ.

ప్రతిష్ఠకు, ప్రేమకు పోరాటం —

అభిమానానికి, అవమానానికి ఘర్షణ —

పెద్దరికానికి, రక్తపాశానికి సమరం —

"ఆనంద్ ..." ఆయన గొంతు వణికింది.

ఈసారి ఆ కంఠంలో కాఠిన్యత లేదు... కరుణ వుంది ! ద్వేషం ధ్వనించలేదు... మమత ప్రతిధ్వనించింది.

ఆయన ముఖంలో అవధులు దాటిన ఆప్యాయత— ఆయన నయనాలలో మూర్తీభవించిన మమకారం — ఆయన శరీరంలో అణువణువునా వెల్లువలా జాలి — అంతలోనే ఎంతో మార్పు ...

ఉప్పెనలా వచ్చిన ఉద్రేకం చటుక్కున మాయమైంది. రక్తపాశం వాస్తవికతా కవ్వంకు చుట్టుకొని మనోసాగరాన్ని మథించింది.

ఆ మథనంలో తొలుత క్రోధం ఆవతరించినా క్రమేపీ ప్రేమ, అనురాగం, ఆప్యాయత వెలువడ్డాయి. రావ్‌గారి కళ్ళు శ్రావణ మేఘాలయ్యాయి.

'దీని కంతటికీ కారణం నేనే!' అంటూ గొణుక్కున్నారు.

శరీరంలో నిస్సత్తువ ఏర్పడటంతో ప్రక్కనున్న కుర్చీలో అలానే కూర్చుండిపోయారు.

ఆయన మనోతటాకంలో రాయిలా వచ్చిపడిన వుత్తరం ఆలోచనా తరంగాలను సృష్టించింది.

ఆనంద్ ఇలా ప్రవర్తిస్తాడని తను అనుకోలేదు ! తను కన్నకలలన్నీ ఫలించే రోజు దగ్గర్లోనే వుందని మురిసిపోతుండగా తుఫాను లాంటి వార్త.

ఆనంద్ ఎందుకిలా మారిపోయాడు ?

గతాన్ని విస్మరించాడా ?

ఆనాటి ప్రతిజ్ఞలన్నీ ప్రగల్భాలేనా ?

ఇంత కాలం తను పడ్డ శ్రమంతా వృధాయేనా?

సంవత్సరాలు గడిచినా నాటి సంఘటన ఇంకా తన మనోఫలకమ్మీద మెదులుతూనే వుంది.

ఆనాడు ...

భోగిపండుగ —

కళ్ళంలో ధాన్యరాశి వుంది. తన తండ్రి కాపలా వున్నాడు. సాధారణంగా కుప్పనూర్పిళ్ల సమయంలో తన కండ్రే రాత్రిపూట చేలో కాపలావుండేవాడు. తన తండ్రి తెల్లారేసరికి ఇంటికి వస్తే తను చద్దన్నం తిని చేను దగ్గరకు వెళ్ళేవాడు. పగలు తను, రాత్రిళ్ళు తన తండ్రి చేను దగ్గరకు వెళ్లటం అలవాటయి పోయింది. ఆరోజు ఎనిమిదయినా తండ్రి ఇంటికి రాకపోయేసరికి తను సైకిలేసుకొని డొంకదారి వెంట బయల్దేరాడు. చేలో జనం కన్పించేసరికి తనకు కంగారెక్కువైంది, సైకిల్‌ను క్రిందపడేసి కళ్లంలోకి పరిగెత్తాడు తను. తను వెళ్లగానే జనం పక్కకు తప్పుకొన్నారు. తన తండ్రి పొత్తికడుపును పట్టుకొని నేలమీద బాధతో మెలికలు తిరిగిపోతున్నాడు. అరగంటనుంచి అలా బాధపడుతున్నాడని కూలీలు చెప్పారు. వెంటనే రెండెడ్ల బండిలో ఆయన్ని తమ వూరుకి పదిమైళ్ల దూరంలో వున్న హెల్త్ సెంటర్‌కు తీసుకు వెళ్లటం జరిగింది. తీరా అక్కడకు వెళ్ళేసరికి కొత్త డాక్టరింకా జాయిన్ కాలేదన్నారు. తను దురదృష్టానికి తోడు ఆకాశం మేఘావృతమైంది. సన్నగా ప్రారంభమైన జల్లులు ఉధృతమై కుంభవృష్టిగా మారింది. అతికష్టమ్మీద వానలో తడుస్తూనే రాత్రికి బందరు చేరుకొన్నారు. జనరల్ హాస్పిటల్లో జాయిన్ చేసిన పది నిముషాలకే ఆయన ఈ లోకాన్ని విడిచి వెళ్లిపోయాడు.

ఆయన అపెండిసైటిస్ వలన చనిపోయాడని, వెంటనే వైద్యం చేసివుంటే బ్రతికి వుండేవాడని డాక్టర్లు అన్నారు. అప్పటికి ఆనంద్‌కు ఎనిమిదేళ్లుంటాయి. ఆరోజు ఆనంద్ ఆవేశంతో పల్కిన మాటలు ఇంకా తన చెవుల్లో మారుమ్రోగుతూనే వున్నాయి... 'నాన్నా! మన వూళ్లో కూడా డాక్టరుంటే తాత చచ్చిపోయేవాడు కాదు కదూ! నేను బాగా చదువుకొని డాక్టరయి యిక్కడే మన వూళ్లో ఆస్పత్రి కట్టిస్తా!' తండ్రి పోయాడన్న దుఃఖం ఓ ప్రక్క మనసును కృంగదీస్తుంటే ఆత్మవిశ్వాసంతో ఆనంద్ పల్కిన మాటలు మరో ప్రక్క మనసుకు ఊరట కల్గించాయి.

అనుకొన్న ప్రకారం పగలనక రేయనక కష్టపడి చదివి ఇంటర్ పూర్తి చేశాడు ఆనంద్. మంచి మార్కులు రావటంచేత డొనేషన్ అవసరం లేకుండా మెడిసిన్‌లో సీటు దొరికింది. పెద్దోడు శేషగిరి ఇంటిపట్టునే వుండి తనకు వ్యవసాయంలో సాయం చేసేవాడు. వాడిక్కూడా తమ్ముణ్ణి డాక్టరును చేయాలనే కోరిక వుండేది. కాలగర్భంలో సంవత్సరాలు గడచిపోయాయి. శేషగిరి పెళ్లి రమతో జరిగిపోయింది. ఆనంద్ హౌస్‌సర్జన్‌గా చేస్తుండగా హైద్రాబాద్ నుండి వాడికి ఓ సంబంధం వచ్చింది. అమ్మాయి కూడా డాక్టరేనని, భాగ్యవంతుల బిడ్డని చెప్పారు. పార్వతి ఆ సంబంధానికి ఒప్పుకోలేదు. కలవారి బిడ్డ తమ వాతావరణంలో ఇమడటం కష్టమని ఆనంద్‌కు వేరే-రైతు కుటుంబంలోని పిల్లను చూద్దామంది. శేషగిరి మాత్రం ఎటూ మాట్లాడలేదు. 'వాళ్లిద్దరూ డాక్టర్లు! బాగా చదువుకొన్నవారు. ఒకరినొకరు అర్థం చేసుకొని సక్రమంగా సంసారం చేసుకొంటారనే నమ్మకం నాకుంది. మనసు మంచిదైతే కలవారైనా పేదవారైనా సమస్యలు రావు. అదీగాక ఆనంద్ కూడా ఆ అమ్మాయిని పెళ్లాడటానికి యిష్టపడుతున్నాడని మధ్యవర్తి చెప్పాడు. వాడిష్టప్రకారమే ఒప్పుకోటం మంచిది' అని తను పార్వతికి నచ్చజెప్పాడు. రమ కూడా తన అభిప్రాయాన్ని బలపర్చింది.

ఆ సంవత్సరమే ఆనంద్ పెళ్లి అనువమతో జరిగిపోయింది. పెళ్లికాగానే ఆనంద్ హైద్రాబాద్‌లో వుండి ఎమ్. డి. చేయటానికి నిర్ణయించుకొన్నాడు ఏ ఆటంకం లేకుండా వాడు ఎమ్. డి. కూడా పూర్తిచేశాడు. నెల రోజుల క్రితం వాళ్లిద్దరు తను వూరొచ్చి వారం రోజులుండి వెళ్లారు. అప్పటికి తను కొత్త భవంతి చాలావరకు పూర్తయింది. గోడలకు ప్లాస్టరింగ్ కూడా అయిపోయింది. ఎటూ మిగిలినదల్లా కరెంటు కనక్షన్. ఆనంద్‌ను తన భవంతి వద్దకు తీసుకు వెళ్లి 'చినబాబూ ! తాతగారు పోయినప్పుడు నీవు అన్న మాటలు గుర్తున్నాయి కదా! కష్టపడి చదువుకొని డాక్టర్ అయ్యావు. నీ కోరిక తీరటానికి నా ప్రయత్నం కూడా నేను చేయాలనుకొన్నాను. మన మెట్టపొలం అమ్మేసి ఈ బిల్డింగ్‌ను కట్టించాను. మంచిరోజు చూసి తాతగారి పేరుతో నిర్మించిన ఈ నర్సింగ్‌హోమ్‌ను నీవు ప్రారంభించాలి...' అన్నాడు తను.

'బిల్డింగ్ చాలా బాగుంది నాన్నా!' అన్నాడు వాడు చుట్టూ పరికిస్తూ.

మన దేశంలో మారుమూలలున్న పల్లెటూళ్ళు ఎన్నో ఎంతో అభివృద్ధి చెందుతున్నాయి. అదేమి చిత్రమో కాని ఆనంద్‌కు మెడిసిన్ పూర్తయినా తమ వూరికి హాస్పిటల్ రాలేదు. అది కొంత బాధ కల్గించినా తమ వూళ్లో మొట్టమొదటి డాక్టర్ ఆనంద్ కాబోతున్నందుకు ఎంతో సంతృప్తి కల్గింది...

శాస్త్రిగారిని అడిగి నర్సింగ్‌హోమ్ ప్రారం

ణానికి ముహూర్తం పెట్టించి ఆనంద్‌కు ఉత్తరం రాశారు తను.

జవాబుగా ఈ ఉత్తరం ...

హే భగవాన్! ఏమిటీ పరీక్ష?

తన రక్తంలో రక్తం పంచుకు పుట్టిన ఆనంద్ ఎందుకిలా మారిపోయాడు?

తననెందుకిలా అవమానాలపాలు చేస్తున్నాడు? టేబుల్‌మీద మోచేతులు ఆన్చి రెండు చేతుల్లోను తలదాచుకొని ఎంతోసేపు విలపించారు రావ్‌గారు.

“టీ తెచ్చానండీ!” పార్వతమ్మగారి మాటలు విని చటుక్కున తలెత్తారు.

భర్త ముఖంలో దిగులు, నిరాశ కన్పించగానే పార్వతమ్మగారు ఎంతో ఆందోళన చెందారు.

“ఏం జరిగినదండీ!” అడిగారు ఆత్రంగా టీ కప్పును టేబుల్‌మీద పెడ్తూ.

రావ్‌గారు సమాధానం చెప్పకుండా నేలమీద పడివున్న ఉత్తరాన్ని తీసి అందించారు.

నలిగిపోయిన ఆ ఉత్తరాన్ని చేతి వేళ్ళతో సరిచేసి కంగారుగా చదివారు పార్వతమ్మగారు.

నాన్నగారికి,

ఆనంద్ నమస్కారములు. మీరు వ్రాసిన ఉత్తరం అందినది. అనుపమకు పల్లెటూళ్ళంటే ఎలర్జీ. చిన్నప్పట్నుంచీ సిటీ లైఫ్‌కు అలవాటు పడింది. అదీగాక మామగారు తమ ఇన్‌ఫ్లుయన్స్‌ను వుపయోగించి మా యిద్దర్నీ స్టేట్స్‌కు పంపటానికి నిర్ణయించుకొన్నారు. కాబట్టి మీరనుకొన్నట్లుగా మన వూళ్ళో నేను ప్రాక్టీసు పెట్టలేకపోతున్నాను. మేము వారంరోజుల్లో బొంబే వెళ్తున్నాం. ఈలోపు అమ్మ, మీరు హైద్రాబాద్ రండి. అమ్మకు నమస్కారములు.

మీ
ఆనంద్.

* * *

గోధూళి వేళ ...

పడమటి గాలి పూల పరిమళాలను మోసుకొస్తోంది. ఆకాశంలో రంగు రంగుల పక్షులు రెక్కల శబ్దం చేసుకొంటూ కేరింతలు కొడ్తున్నాయి.

తోటలో మామిడిచెట్టు నీడలో పడక కుర్చీ వేసుకొని పచ్చగా ఏపుగా పెరుగుతున్న మామిడి చెట్టు వైపు పరధ్యానంగా చూస్తున్న రావ్‌గారికి “తాతయ్యా” అన్న పిలుపు విన్పించింది.

ఉలిక్కిపడి చూశారు.

శేషగిరి కూతురు పద్మ పరిగెత్తుకొంటూ వచ్చింది. చేతుల నిండా బురద అంటుకొని వుంది. గౌనుక్కూడా అక్కడక్కడ మట్టి మరకలున్నాయి.

“ఏమిటమ్మా! ఒళ్ళంతా అలా మట్టి చేసుకొన్నావే?” అని అడిగారు.

“నేను, రవి చెట్లకు కుదుళ్ళు చేస్తున్నాం తాతయ్యా! మరేమో ... రవి యిందాకట్నుంచీ ఒకటే యేడుస్తున్నాడు తాతయ్యా ...”

“ఎందుకమ్మా?” అని అడిగిన రావ్‌గారికి సమాధానం చెప్పకుండా ఆయన చేతిని పుచ్చుకొని తోటలోకి నడిపించుకు వెళ్ళింది పద్మ. మామిడి చెట్లు, పనసచెట్లు ఓ ప్రక్క— బత్తాయి, నిమ్మ మరోప్రక్క—మధ్య మధ్యలో రకరకాల క్రోటన్స్— దారికి అటు ఇటు గులాబీలు. ముద్దమందారాలు, నూరు వరహాలు నవ్వుతూ స్వాగతం పల్కుతున్నాయి. సాయం వీచికలు మోసుకొస్తున్న సుగంధ పరిమళాలు హృదయానికి ఎంతో ఆహ్లాదాన్ని కల్గిస్తున్నాయి. తోటలో అడుగులు వేస్తుంటే ఆ ప్రకృతిలో అణువణువు ఆనంద్‌ను గుర్తు చేస్తున్నాయి రావ్ గారికి. ఈనాడు ఈ తోట ఇలా వర్ధిల్లుతున్నదంటే ఆ క్రెడిట్ అంతా ఆనంద్‌దే! పచ్చని చెట్లన్నా, రంగుల పూలన్నా ఆనంద్‌కు చాలా యిష్టం! చిన్నప్పట్నుంచీ వాడికి తోటపని అంటే ఎంతో సరదా! సరిగ్గా వాడి లక్షణాలే తన మనవరాలికి వచ్చాయి. బడి వదలగానే పద్మ ఓ గంట తోటపని చేస్తుంది. రవి కూడా దానికి సాయం చేస్తాడు. రకరకాల మొక్కలను తెచ్చిపెట్టడానికి వాళ్ళిద్దరూ పోటీ పడతారు. వానాకాలం వచ్చిందంటే చాలు శేషగిరితో బందరు నుంచి రకరకాల మొక్కలను, విత్తనాలను తెప్పించి నాటుతారు. అదిగాక వూళ్ళో ఎక్కడైనా కొత్తరకం మొక్కలు కన్పిస్తే వాటిని తీసుకువచ్చి తమ తోటలో నాటేవరకు నిద్రపోరు ...

“అదుగో తాతయ్యా రవి!” అంది పద్మ.

డాక్టర్ కె. వెంకటేశ్వరరావు

పి. ఎస్. వి. — రాజమండ్రి

నాకు చాలాసార్లు యూరిన్ వెళ్ళవలసివస్తుంది. గంట, గంటన్నరసేపు పైగా ఆపుచేసుకొంటే కడుపునెప్పి వస్తుంది. రాత్రి 3, 4 సార్లు లేవవలసి వస్తుంది.

★ మీరు యూరిన్ కల్చర్ మూత్రంలో ఆల్బ్యుమన్, షుగర్ పరీక్ష, ఇన్‌ట్రావీనస్, పైలో గ్రామ్, సిస్టోగ్రాం మొదలయిన పరీక్షలు చేయించుకోవలసి ఉంటుంది. ఈ ఫలితాలను శస్త్రవైద్యులకి చూపించండి.

ఎ.ఎస్.ఆర్. — సిర్‌పూర్ కాగజ్‌నగర్

మా అమ్మాయి వయస్సు 40 సం. లు. ఆయాసం, ఒళ్లంతా వాచి పోవటం, చాలా ఆకలిగా ఉండటం, నిద్ర పట్టక పోవటం, నీరసం మొ॥వి ఉన్నాయి. ఎందుకు ఇలా ఉంటుంది ? ఏమైనా చికిత్స చేయించాలా ? ఆపరేషన్ చేయించాలా ?

★ బ్లడ్ షుగర్, యూరిన్ షుగర్, మొదలయిన పరీక్షలు, బ్లడ్‌ప్రెషర్, ఛాతీ ఎక్స్‌—రే, ఇ.సి.జి, బ్లడ్ కొలెస్టరాల్ మొదలయిన పరీక్షలు చేసి చూపించండి. రోగ నిర్ధారణ తర్వాత మందులతో తప్పక నయమవుతుంది. శస్త్ర చికిత్స ప్రమేయం లేదు.

జి. వి. ఎల్. — మచిలీపట్నము

మా చెల్లెలు వయస్సు 20 సంవత్సరములు, ఎప్పుడూ సుద్దముక్కలు తింటుంది. దీనివలన ఏమైనా జబ్బులు వస్తాయా ?

★ మల పరీక్ష చేయించి క్రిములు ఉన్నదీ లేనిదీ పరీక్షించి చికిత్స చేయించండి. మానసిక ఆందోళనవల్ల ఇలా జరిగే అవకాశం ఉంటుంది. మానసిక ఉల్లాసం కలిగించే పరిస్థితుల ప్రాబల్యం వల్ల ఈ లక్షణం పోయే అవకాశం ఉంటుంది. ఇనుప ధాతువులుగల మాత్రలవల్ల (ఫెర్రస్ సల్ఫేట్) కొద్దిగా ఫలితం ఉంటుందని నిపుణుల అంచనా.

జి. పి. ఆర్. — అనంతపూర్

మా పెళ్లయి 2½ సంవత్సరములు అయినది నా భార్య ప్రతిసారి రెండు నెలలకుపైగా బైట చేరటం నిలిచిపోయి తర్వాత బైట చేరటం జరుగుతుంది. ఇలా ఎందుకు జరుగుతుంది ? గడిచిన కాలంలో నేను వ్యభిచారం ఎక్కువ చేసాను. దానికి, దీనికి ఏమైనా సంబంధం వున్నదా? మాకు పిల్లలు కలగాలంటే మీ వైద్య సలహా తెలుప ప్రార్థన.

★ లేడీ డాక్టర్లవద్ద మీ భార్యను పరీక్ష చేయించండి. మీరుకూడా రక్త పరీక్ష చేయించుకోవటం అవసరం.

మామూలుగా సుఖరోగంవల్ల అబార్షన్ జరగదు. వీర్య పరీక్ష మగవారు చేయించుకోవలసిన ఒకే ఒక పరీక్ష. ముందుగా మీరు ఆ పరీక్ష చేయించుకొని మామూలుగా ఉన్నదని తేలినప్పుడు మీ భార్యను లేడీ డాక్టరువద్ద పరీక్ష చేయించండి.

టి. వి. ఎల్. — వెంకటపాలెం

నాకు ఎడమ రొమ్ములో గడ్డలాగ లేచింది. పైకేమీ కనిపించదు. ఇది ఒక సంవత్సరముగ వున్నది. అప్పుడప్పుడు కొద్దిగా నెప్పిగా వుంటుంది. ఒళ్ళంతా నెప్పి వచ్చి జ్వరము వచ్చేది. డాక్టర్‌కి చూపిస్తే ప్రమాదమేమీ లేదని మందులు వాడమన్నారు. మందులు వాడినన్ని రోజులు గడ్డ కరిగిపోయినది. మందులు ఆపివేసాక మరల గడ్డ పెరిగినట్లు వున్నది.

★ ఈ గడ్డ ఫైబ్రో అడినోమా అయి ఉండవచ్చును. ఈ రకం గడ్డలు రొమ్ము భాగంలో సులువుగా కదలుతూ ఉంటాయి. ఎక్కువ నెప్పి ఉండదు. వీటిని శస్త్రచికిత్స ద్వారా తీసి వేయటం మంచిది. ★

వేరుజాతి మొక్క

మాతి పళ్లెం గట్టు మీద కూర్చుని ఏడుస్తున్నాడు రవి.

రావ్‌గారు వెళ్లేసరికి రాగం తారస్థాయిని అందుకొంది.

"ఏం జరిగిందిరా, బాబూ ?" అంటూ ఎత్తుకొని బుజ్జగించారు రావ్‌గారు.

"తాతయ్యా...మరి...నేను పెట్టిన మొక్క... చచ్చిపోయింది ..." అన్నాడు ఏడుస్తూనే.

"రా తాతయ్యా !" అంటూ పద్మ రావ్‌గారిని మొక్కలు నాటిన ప్రదేశానికి తీసుకు వెళ్లింది.

అక్కడ రెండు జామ మొక్కలు మాత్రం నవనవలాడుతూ పెరుగుతున్నాయి. వాటి ప్రక్కనే ఓ మొక్క వాడలి నేలకు అంటుకుపోయింది.

రవిని క్రిందికి దింపి ఆ మొక్కను పరిశీలనగా చూసి "ఏం మొక్కమ్మా పద్మా ! దీన్ని ఎక్కణ్ణుంచి తెచ్చారు ?!" అని అడిగారు రావ్‌గారు.

"రవి, నేను మొన్న మున్నబు గారింటికెళ్లాం తాతయ్యా ! ఇలాంటి మొక్కలు ఆళ్లింట్లో చాలా వున్నాయి. రవి కావాలంటే ఈ మొక్క యిచ్చారు. నేనేమో రెండు జామ మొక్కలు తెచ్చాను. నేను తెచ్చిన మొక్కలు చక్కగా బతికాయి. కాని వాడు పెట్టిన మొక్క చచ్చిపోయింది.ఎందుకని తాతయ్యా" ప్రశ్నించింది పద్మ.

రావ్‌గారు ఆమొక్కనులాగేసి పరీక్షగాచూశారు.

"ఇదేదో పిచ్చిమొక్కమ్మా !" నవ్వుతూ అన్నారు.

"కాదు తాతయ్యా ! ఆపిల్ మొక్కంట. మున్నబుగారబ్బాయి చెప్పాడు !" రవి అన్నాడు అమాయకంగా.

"ఆపిల్ మొక్కలు మన తోటలో పెరగవు బాబూ !"

"మరెక్కడ పెరుగుతాయి తాతా ?" ఠక్కున ప్రశ్నించింది పద్మ.

"కాశ్మీర్‌లో !"

"అదేమిటి తాతయ్యా ! ఈ తోటలో ఇన్ని మొక్కలు బతికాయి కదా ! మరి ఏపిల్ మొక్క ఎందుకని బతకదు ?"

రావ్‌గారు క్షణం సేపు గతుక్కుమన్నారు.

పద్మ, రవి సమాధానం కొరకు ఆత్రంగా చూడసాగారు.

"మొక్కయినా మనిషయినా పుట్టేది ఈ భూమ్మీదే ! మనుషుల్లో రకరకాల మనస్తత్వాల వాళ్లు వున్నట్లే మొక్కల్లో కూడా రకరకాల జాతులు వున్నాయమ్మా ! ఒక్కో జాతి మొక్కకు ఒక్కో రకమైన వాతావరణం, వనరులు, పరిసరాలు అవసరమౌతాయి. ఒక మొక్కకు అనుకూలమైన పరిస్థితులు మరో మొక్కకు ప్రతికూలమౌతాయి. ఏ నేలలో బ్రతికే మొక్క ఆ నేలలోనే బ్రతకాలమ్మా !" రావ్‌గారి కంఠం గద్గదమైంది.

"తాతయ్యా ! ఏపిల్ మొక్క మన తోటలో బతకదన్నావు. మరి మన తోటలో బతికే జామి మొక్క కాశ్మీరులో బతుకుతుందా ?"

పద్మ ప్రశ్న వినగానే రావ్‌గారి కళ్ళు అప్రయత్నంగా అశ్రుపూరితాలయ్యాయి.

"బ్రతుకుతుందమ్మా ! తప్పకుండా బ్రతకాలనే ఆ భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నాను !" అన్నారు ఆవేశంగా.

అంతకుముందే అక్కడకు వచ్చి మౌనంగా సంభాషణ వింటున్న పార్వతమ్మగారికి భర్త మాటలు వినగానే దుఃఖం ఆగలేదు.

వాళ్లిద్దరు ఎందుకు ఏడుస్తున్నారో పద్మకు అర్థంకాలేదు. కాని రవికి తెల్సు వాళ్ల దుఃఖానికి కారణం !

'పాపం ! ఆపిల్ మొక్క బతకనందుకు అమ్మమ్మ, తాతయ్య ఏడుస్తున్నారు!' అనుకొన్నాడు మనసులో రవి. ★